# జల్లు

పెరట్లో మంచంమీద నడుం వాల్చింది సుమిత్ర. చల్లటి గాలి ప్రాణానికి హాయిగా ఉంది.

గాలికి బొగడచెట్టు కురిపిస్తోంది పూలజల్లు. ఆ పూల పరిమళం గాలితో కలిసి సుతారంగా తేలొస్తోంది. వానొచ్చే సూచనలు కనబడుతున్నాయి. నీలిరంగు మబ్బులు ఊసర వెల్లిలా రంగు మారుస్తూ నలుపులోకి దిగాయి.

శివమెత్తినదానిలా ఊగిపోతోంది మందారచెట్టు. అతి వినయంగా, ఎవరికో సలాం చేస్తున్నట్టు వంగుతూ లేస్తున్నాయి జీనియా మొక్కలు. కొమ్మ ఉయ్యాలలూగుతూ ఆనందంతో తెగ మురిసిపోతున్నాయి గులాబి బాలలు.

మొత్తంమీద ప్రకృతి అంతా, వాన రాకడ తెలిసి పరవశించి పోతున్నట్టుగా అనిపించింది సుమిత్ర మనసుకి.

ఈ ఏడాది ఇంతవరకూ వానచినుకు పడలేదు. రైతులు గోల పెడుతున్నారు .... ఇవాళ వర్షాకాలానికి ప్రారంభం కాబోతోంది. ప్రకృతి కంతకీ ఈ రోజు పర్వదినం .... తన జీవితానికి .... ?? ప్రశ్నతో పాటు ప్రకాశం నిలిచాడు కళ్ళముందు.

" మీ సిన్సియారిటీ, పంక్చుయాలిటీ నాకు చాలా నచ్చాయి .... " ప్రకాశం హృదయంలోంచి వచ్చిందామాట.

" థ్యాంక్సు "

మొదటిసారి సంభాషణ అంతమటుకే.

చాలాసార్లు ఆఫీసులో ఎంతమంది వేళాకోళపు మాటలకో గురైంది సుమిత్ర. ఒక్క ప్రకాశం మాత్రమే ఏ విధమైన వేళాకోళపు మాటలూ అనకపోవడం గమనిస్తూనే ఉంది. ఆఫీసంతటికీ అతని మాటలే తన పాలిటి పన్నీటిజల్లు. సహృదయం, సంస్కారం అతనిలో చూడగలిగింది తను. మంచి మనస్సున్నవాడు .... అందుకే .... " నీ అందం నన్ను పిచ్చివాడిని చేస్తోంది " అంటూ లొంగదీసుకోవాలని చూడలేదు శేఖర్‌లా. " నిన్ను ప్రేమిస్తున్నాను " అంటూ వెంటపడలేదు మోహన్‌లాగా. దగ్గరగా వచ్చి రహస్యంగా " దీపక్‌లో మంచి పిక్చరాడుతోంది వెళ్దాం రమ్మని " అనలేదు ప్రసాద్‌లా.

ఫైల్ అందించేటప్పుడు గానీ, తీసుకునేటప్పుడు గానీ కావాలని వేళ్ళు తగిలించలేదెప్పుడూ గురుమూర్తిలాగా.

శేఖర్ ఎప్పుడూ బాడీగార్డులా తిరిగేవాడు కాదూ తన వెంట. మోహన్ మటుకూ ఏంచేశాడూ ? "నువ్వు నచ్చావు. నీ మనసు నచ్చింది " అంటూ కబుర్లు చెప్పాడు. తన గతం అతనికి చెప్పకపోతే మోసం చేసినట్టవుతుందని, పుస్తకంలా అతని ముందు తన గతం విప్పింది .... అంతే. కథల్లోలా కబుర్లు చెప్పిన ఆ డంబాలరాయుడు మళ్ళీ తనకంట పడితే ఒట్టు. తన తల్లితండ్రులకి తన భవిష్యత్తు అగమ్యగోచరంగా లేదు. తను మొండిది .... తన కాళ్ళమీద తను నిలబడగలదు. ఉద్యోగం ఉంది. దానికి సంబంధించిన పరీక్షలకి కడుతూ ఉద్యోగంలో పై పైకి పోగల అవకాశాలున్నాయి. అదే ఆశయంగా ఉద్యోగంలో మంచి పేరు

తెచ్చుకుంటూ పైపైకి వెళ్ళిపోవాలి. ఎవరూ తనని పెళ్ళాడేందుకు ముందుకు రారేమోనన్న దిగుల్తో క్రుంగిపోనక్కర్లేదు. ఇదీ తన నిర్ణయం. అందుకే తన భవిష్యత్తు తనకెప్పుడూ అంధకారమయంగా అనిపించదు.

ఈ ఊళ్లోనూ శేఖర్ లాంటి వాళ్ళు, మోహన్‌లా మాట్లాడినవాళ్ళూ తారసపడకపోలేదు. కానీ, అనుభవం నేర్పిన పాఠం వల్ల ప్రతి పిరికి పందకీ తన గతం చెప్పడం అనవసరం అనిపించింది. తానెంత తప్పుకు తిరిగినా తన అందం చూసి "ప్రేమ ప్రేమ" అంటూ వెంటబడుతున్న రకాలే వీళ్ళని తెల్సి "క్షమించండి. నాకా ఉద్దేశం లేదు" అంటూ స్థిరంగా చెప్పడం అలవాటు చేసుకుంది తను. దాంతో 'గర్వం' అనీ, "అహంకారం" అనీ తన గురించి చెప్పుకుని కసి తీర్చుకుంటున్నారు షోకిల్లారాయుళ్లు. ఏమీ పట్టించుకోకుండా, ఆఫీసులో తన పని తను చేసుకుని ఇంటికి రావడానికి అలవాటుపడింది తను.

అలాంటిది ఇప్పుడు ఈ ప్రకాశం ఒక్కనాడు కూడా వెకిలివేషాలు వెయ్యని ప్రకాశం, ఎన్నడూ మాటతో గానీ చూపుతో గానీ తన మనసు నొప్పించని ప్రకాశం, తన తండ్రిని పార్కులో ఒంటరిగా కల్సుకుని "మీ అమ్మాయికీ, మీకూ ఇష్టమైతే మీకెవరికీ ఏ విధమైన అభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని ఉంది" అంటూ ఎంతో మర్యాదగా అడిగాడు. "తొందరలేదు. ఇంట్లో మీరంతా ఆలోచించు కుని చెప్పండి. ఒకవేళ సమాధానం నా కోరికకి వ్యతిరేకంగా ఉన్నా చెప్పడానికి మొహమాట పడకండి. నేనేమీ అనుకోను. మీ అమ్మాయికీ నాకూ మధ్య ఉన్న స్నేహభావం ఇదివరకుమల్లే నే ఉంటుంది. చెక్కు చెదరదని హామీ ఇస్తున్నాను" అనికూడా అన్నాడట. తండ్రి తనతో

ఆ మాటలు చెప్పి ఏమంటావమ్మా ? నీ ఉద్దేశ్యం ఏమిటి ? అన్నట్టుగా ఆత్రుతగా తన కళ్ళలోకి చూసినప్పుడు తలదించుకుంది తను. "నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి" అనిమాత్రం అంది.

బాగా ఆలోచించుకొని, ఒక నిశ్చయానికొచ్చింది.

తండ్రికి తెలియకుండా ప్రకాశం పేరిట ఒక ఉత్తరం రాసి అతనికి అందచేసింది. కాయో, పండో తెలియవలసింది ఈరోజే ....

పక్క ఇంట్లో పెరటి అరుగుమీద కూర్చుని భాగ్యం పాడుతున్న పాట తీయగా సాగుతూ తేనెజల్లులా తోచింది సుమిత్రకి ... సా విరహే తవ దీనా రాధా ... పాడుతోంది ... భాగ్యం ... ఆ తీయనైన స్వరం సుమిత్రని ఆలోచనల్లోంచి పూర్తిగా ఇవతలకి లాగింది.

భాగ్యం చాలా బాగా పాడుతుందన్న సంగతి సుమిత్ర కిదివరకే తెల్సు. అప్పుడప్పుడు పెరట్లో ఏకాంతంగా కూర్చుని చిన్నగా పాడుకోడం భాగ్యానికి అలవాటన్న సంగతి కూడా తెల్సు. ఆ విధంగా అప్పుడప్పుడు భాగ్యం పాటలు వింటూనే ఉంటుంది సుమిత్ర. "సా విరహే తవ దీనా రాధా" సుమిత్రకిష్టమైన పాటల్లో ఒకటి. ఇప్పుడాపాటే భాగ్యం పాడుతుంటే మైమరచి వింటూ ఉండిపోయింది ... పాట పూర్తయిం ది... భాగ్యం మరో పాట అందుకుంటుందని ఆసక్తిగా ఎదురుచూసింది సుమిత్ర. కానీ, అలాంటి సూచనలేమీ కనిపించలేదు.

చల్లని గాలి....చక్కటి పూల పరిమళం....ఇంత చల్లటి చక్కని సాయం సమయంలో భాగ్యం పాటలు వింటూ లోకాన్ని మర్చిపోవచ్చు... భాగ్యాన్ని పలకరించి నాలుగైదు రోజులైపోయింది .... ఒకసారి పలకరించి నట్టూ ఉంటుంది.. మరో పాట వినిపించమని అడగనూ అడగచ్చు.. లేచి, తమ ఇంటికీ వాళ్ళింటికీ మధ్యనున్న అడ్డుగోడ దగ్గరకి నడిచింది సుమిత్ర....అంతే.... ఏడుస్తున్న భాగ్యాన్ని చూస్తూనే తెల్లబోయింది.

" ఏమైంది భాగ్యం? " అప్రయత్నంగా వచ్చింది ప్రశ్న.

ఉలిక్కిపడి చూసింది భాగ్యం.

కొంగుతో కళ్ళూ, మొహం తుడుచుకుని నవ్వబోయింది. బలవంతంగా నవ్వలేక చిన్నగా నిట్టూర్చింది.

" ఏమైంది భాగ్యం? మీ వాళ్ళదగ్గరనించేమైనా ఉత్తరం వచ్చిందా? అంతా కులాసాయేకదా! "

అంతా కులాసాయేనన్నట్లు తలఊపుతూ కూర్చున్న చోటనించి లేచి గోడ దగ్గిరకి వచ్చింది భాగ్యం.

ఏదో చెప్పబోయింది.... దుఃఖం ఆ మాటని అడ్డుకుంది.

మరి నోట మాటరాలేదు. రెండు చేతుల్లోనూ మొహం దాచుకుంది. ఆ చేతుల్ని విడదీసింది సుమిత్ర.

కారణం తెలియకపోయినా, భాగ్యాన్ని ఆ స్థితిలో చూస్తూంటే సుమిత్రకి కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

" ఏ మైంది భాగ్యం? నాకు చెప్పవూ? నేనూ, నువ్వూ అక్కాచెల్లెళ్ళం అంటూ ఉంటావుగా ఎప్పుడూ .... చెప్పు .... నేనే మైనా సాయపడగలిగితే చేస్తాను...."

మరొకసారి కళ్ళు తుడుచుకుంది భాగ్యం. " సుమిత్రా.... కాలమే నా సమస్యని పరిష్కరించాలి.... అయినా నీకు చెప్తాను...." ఒక్కక్షణం ఆగింది భాగ్యం.

తనకంటే వయసులో చిన్నదైన భాగ్యానికి.... ఈ మధ్యనే ఆర్నెల్ల క్రిందట పెళ్ళయి, ఈ ఊరికి ఈ ఇంట్లోకి కొత్త కాపరం వచ్చిన భాగ్యానికి ఏం కష్టం వచ్చిందోనన్న ఆతృత సుమిత్ర కళ్ళల్లో కదలాడింది.

" మా వారికి, నా గురించిన రహస్యం ఒకటి ఈ మధ్య తెల్సింది. ఆ రోజునుంచి తనలో పెరుగుతూ వస్తున్న కోపం ఇంత అని చెప్పలేను. నేననుభవిస్తున్న నరకం మాటల్లో చెప్పలేను [సుమిత్రా చెప్పలేను.... ఆ కోపంలో, ఆవేశంలో ఆయన ఏదో ఒక రోజు నన్ను హత్య చేసినా చేస్తారు."

" ఛ.... అవేం మాటలు భాగ్యం ? "

" ఔను ఉన్నమాటే అంటున్నాను సుమిత్రా....భర్తగా ఏ మగాడూ సహించ లేని, ఓర్వలేని లోపం నాలో ఉన్నప్పుడు ... "

" అంత తప్పు నువ్వేం చేశావు భాగ్యం ? " నమ్మలేనట్టుగా చూసింది సుమిత్ర.

" పెళ్లి కాకముందు ' రఘు ' అనే అతని ప్రేమలో పడ్డాను. అదే నేను చేసిన క్షమించరాని నేరం, మా ప్రేమ ఫలించలేదు. ఆ రహస్యం దాచిపెట్టి నా తల్లి తండ్రులీ పెళ్లి చేశారు. నేనూ మనస్ఫూర్తిగానే ఒప్పుకున్నా నీ పెళ్లికి. నన్ను మోసం చేసిన ఆ రఘు మీద కోపం, అసహ్యం కలిగాయి నాకు. అతని మీదున్న సదభిప్రాయం కాస్తా పోయింది. నాలో పెళ్లయిన మరుక్షణం నించీ నేను వీరినే ప్రేమిస్తున్నాను. ఆ రఘుని మనసులో తలవనుకూడా తలవక్లేదు .... కానీ .... కానీ సుమిత్రా....ఒకనాటి నా ప్రేమకథ ఈయన చెవుల ఎలా పడిందో ఏమో? ఎవరు ఊదారో ఏమో? ఆ రోజునించీ తనలో చాలా మార్పు వచ్చింది.... ఎంతమందితో తిరిగావు! ఎంతమందిని ప్రేమించావు? రహస్యంగా దాచిపెట్టి నన్ను మోసం చేశావు.... నిన్నేం చేసినా పాపం లేదు. ప్రేమంటూ వాడితో, వీడితో తిరిగే నీబోటి రకాలకి పెళ్ళయ్యాక మాత్రం బుద్ధి కుదురుగా ఉంటుందని ఎవడు చెప్పగలడు? ఏ రోజు ఎవడితో లేచిపోతావో ఏమో అంటూ ఆయన అనే శూలాల్లాంటి మాటలూ కొట్టే దెబ్బలూ భరించలేక పోతున్నాను. పదిరోజులుగా ఆయన ఇంటి

ముఖం కూడా సరిగా చూడట్లేదు. ఆ రఘు విషయం మీతో మా నాన్న గారు, పెళ్ళి నిశ్చయం అవడానికి ముందే చెప్పక పోవడం తప్పేనండీ అంటూ క్షమించమని ప్రాధేయపడ్డాను. అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడని నమ్మిన మాట నిజమే కానీ, అతనితో, నేను ఏనాడూ హద్దు మీరి ప్రవర్తించలేదని ఉన్నమాట చెప్పాను. రఘు ఏనాడైతే మరో అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ వేశాడో అనాడే అతనిమీద అసహ్యం నాలో పేరుకు పోయిందనీ, అతని పేరుకూడా నేను తలవ ట్లేదనీ మనసు విప్పిచెప్పినా కూడా వారికి నా మీద నమ్మకం కలగట్లేదు. నాకు వారిమీద ఏ మాత్రం ప్రేమలేదనీ, అయిష్టంగా ఈ కాపరం చేస్తు న్నాననీ లేనిపోనివన్నీ ఊహించుకుని నన్ను చిత్రహింస పెడుతున్నారు. రోజుకోసారి, నాకు విడాకులిచ్చేస్తానన్న మాట అంటున్నారు .... ” అతి చిన్నగా, ఎదురుగా ఉన్న సుమిత్ర కొక్కదానికే వినపడేస్థాయిలో తన గోడు వెళ్ళబోసుకుంటున్న భాగ్యం ఒక్క క్షణం ఆగి ప్రశ్నించింది “ ఆడవాళ్ల కొక నీతి, మగవాళ్ల కొకనీతి....మన సంఘం మారదంటావా సుమిత్రా? ”

సుమిత్ర ఏదో అనబోయేంతలో మళ్లీ తనే అంది “నన్ను ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటాననీ, నేను లేందే బతకలేననీ, నాతోడిదే జీవితమనీ తీయగా కబుర్లు చెప్పిన ఆ రఘు మరెవరినో పెళ్లాడి హాయిగా, సుఖంగా కాపరం చేసుకుంటున్నాడు. అతని భార్యకి ఒకనాటి అతని ప్రేమ కథ తెల్సిపోతే విడాకులిస్తానని అంటుందా? అంటే ఈ సంఘం దుమ్మెత్తి పొయ్యదూ? ఎప్పటి సంగతో తిరగతోడుతూ చక్కటి కాపురం పాడు చేసు కుందుకు దీనికేంపొయ్యేకాలం అని తిట్టిపొయ్యదూ? అదే మరి మగవాడి నైతే అలా అనడానికి వెనుకాడుతుంది సంఘం....భార్య ఎవరితోనో ప్రేమకథ నడిపించిందిట. అటువంటి చెడినదానితో పరువున్న ఏమగాడు సంసారం చేస్తాడు అంటూ మగవాడినే సపోర్టు చేస్తారు. ....ఔనా? కాదా? ”

సుమిత్ర మనసు అల్లకల్లోలమైంది.

" నా కాపరం నడివీధిన పడటానికి ఇంకా అట్టే రోజు ల్లేవు సుమిత్రా...." భాగ్యం గొంతు వణికింది.

" అలా అనుకోకు భాగ్యం. నీకు మంచి రోజులు తప్పకుండా వస్తాయి. మీవారికి నీమీద అనుమానం పోయి నిన్ను ప్రేమగా చూసు కోవాలని నీ తరఫున నేను కూడా ప్రార్థిస్తాను. అధైర్య పడకు—" అంతకంటే ఏం చెప్పాలో తెలియలేదు సుమిత్రకి.

వీధి తలుపు చప్పుడవడంతో, కళ్లు తుడుచుకుంటూ " వస్తాను సుమిత్రా: ఎవరో వచ్చారు " అంటూ వెళ్లిపోయింది భాగ్యం. 'చిన్నగా నిట్టూర్చి, వచ్చి మళ్లీ మంచమ్మీద వాలిపోయింది సుమిత్ర. భాగ్యం కథ విన్నాక, తను చేసింది ఎంత మంచి పనో పూర్తిగా నిర్ధారణ అయింది సుమిత్రకి.

ప్రకాశానికి తను రాసి, అందజేసిన ఉత్తరం కళ్ళముందు మెదిలింది.

శ్రీ ప్రకాశంగారికి,

మీ గురించి మా నాన్నగారికి అన్ని వివరాలూ చెప్పారు. బాగానే ఉంది. కానీ నా గతం తవ్వి మీ ముందు పోస్తే నన్ను పెళ్ళాడతా నన్న మీ నిర్ణయానికి మీరెక్కడ నీళ్ళొదులుకుంటారో నన్న భయంతో కాబోలు మా నాన్నగారు నా గురించి మీ కేమీ చెప్పలేదు. నా గురించిన వివరాలన్నీ మీకు తెలిశాక, అప్పుడు కూడా మీకేమీ అభ్యంతరం లేకపోతేనే మన పెళ్ళి జరగగలదు. నా తల్లీ, తండ్రీ ఎవరో నాకు తెలియదు. సంతానం లేని రామయ్య, సుభద్రమ్మగార్ల కి నేను పసిగుడ్డుగా ఒక గుడి మెట్లమీద దొరికాను — ఆనాటినుంచీ వాళ్ళే నా తల్లి, తండ్రులయ్యారు. వారి కులమే నా కులం. వారి గోత్రమే నా గోత్రం. నా అసలు

కులగోత్రాలు మీరు తెల్సుకోవాలని కోరితే జవాబు నాకు తెలియదనిమాత్రమే నేను చెప్పగలను. మరో విషయం .... నా పదహారవయేట మా తాహతుకి తగ్గ సంబంధం ఒకటి తెచ్చి నా వివాహం చేశారు మా నాన్నగారు. కానీ పెళ్ళయిన మర్నాడే పెళ్లికొడుకు అదే నా భర్త గుండెపోటుతో కన్నుమూశాడు. ఆ నాటి నుంచీ మా ఊళ్ళో అంతా నన్నొక నష్టజాతకురాలిగా పరిగణించారు. కానీ భగవంతుడు నాకెంతో గుండెధైర్యాన్ని ప్రసాదించి నాకెంతో మేలు చేశాడనిపిస్తుంది. ఎవరనే మాటలూ లెక్కచేయక ప్రైవేట్‌గా బి. ఎ. కట్టి ప్యాసయ్యాను. రెండేళ్ళు మా ఊళ్లో ఒక చిన్న ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాను. ఆ రెండేళ్ళూ ఎన్నో అవహేళనలకి గురిఅయ్యాను. ఎంతో అనుభవం గడించాను జీవితం పట్ల .... పెళ్లి పేరెత్తితే పారిపోయే పిరికిపంద లెందరో ప్రేమ, ప్రేమంటూ నా వెంటపడ్డారు. నన్ను చేసుకోబోయేవాడికి ముందే నా గతం తెలియజేయడం నా విధి అన్న అభిప్రాయం నాది. అందుకే నా గతాన్ని ఉన్నది ఉన్నట్టు చెప్పి ఇప్పుడు చెప్పండి, నన్ను పెళ్ళాడటం మీకు మనస్ఫూర్తిగా ఇష్టమే అయితే పెద్దల ఆశీర్వాదంతో పెళ్ళి చేసుకుందాం అనగానే తోకముడిచి ప్రతివాడూ పారిపోయాడు. "నువ్వు మా కన్నబిడ్డవి కాదని ఎందుకలా చెప్తావు వాళ్ళతోటి? అందుకే నిన్ను పెళ్ళాడటానికి ఎవరూ ముందుకి రావట్లేదు. వచ్చినవాళ్లు కూడా వెనక్కి తిరిగిపోతున్నారు." అంటూ అమ్మా, నాన్నగార్లు కేకలేశారు. కన్నీళ్ళు పెట్టుకున్నారు. వాళ్ళకి నేనిచ్చిన సమాధానం ఒక్కటే. "నేను మీ కన్న బిడ్డని కాదని నాకు తెలియకపోతే అది వేరే విషయం. కానీ, నాకు తెల్సిపోయాక కూడా నన్ను కట్టుకోబోయేవాడి దగ్గర ఆ నిజం దాచడం నా కిష్టంలేదు. ఇందులో భయపడవలసింది ఏముంది? వాళ్ళ కిష్టమైతే చేసుకుంటారు. లేకపోతే లేదు. నిజం దాచిపెట్టామన్న నింద ఆ తర్వాత మనమీద రాకూడదు. అంతే నా క్కావల్సింది. ఒక అనాథ బిడ్డని

తెచ్చి, పెంచి, పెద్దచేసి ఇంతదాన్ని చేశారు. మీరు చేసిన పని మంచిదే కానీ చెడ్డది కాదే ? అటువంటప్పుడు ఒక మంచిపని చేసిన మీరెందుకు భయపడాలి నలుగురిలోనూ ? సహృదయంతో మీరు చేసిన మంచిపని అర్థం చేసుకునే సహృదయం ఉన్నవాడు వచ్చి చేసుకుంటానన్నప్పుడే నా పెళ్ళి అవుతుంది. లేకపోతే నేనిలాగే ఉండిపోతాను. ఉద్యోగం ఉంది నాకు. డిగ్రీ ఉంది .... నా కాళ్ళమీద నేను నిలబడగలనన్న మొండి ధైర్యం నాకుంది. మీరేమీ బెంగపడిపోవద్దు .... " నా సమాధానం వాళ్ళకి తృప్తి కలగించలేదని కూడా నాకు తెల్సు .... రెండేళ్ళ క్రిందట నాకీ ఊళ్లో గవర్నమెంటుఉద్యోగం దొరికి ఇక్కడికి వచ్చేశాము. స్వంత ఊరికి చాలా దూరంగా ఇక్కడుండటంవల్ల నా గతం ఇక్కడెవరికీ తెలియదు .... ఇక్కడ కూడా ప్రేమించానంటూ, పెళ్ళి చేసుకుంటానంటూ నా దగ్గర అతి చనువు చూపించిన వాళ్ళున్నారు. కానీ, ప్రతి వాళ్ళకీ నా కథ చెప్పుకోడం నా కిష్టంలేకపోయింది. వాళ్ళు నా గురించిన వివరాలు తెలిస్తే " ప్రేమ " అన్నమాట ఒకటే ఉపయోగిస్తూ " పెళ్ళి " అనే మాటే తెలియనట్టుగా ప్రవర్తిస్తారని నాకు తెల్సు. పైగా నా గత చరిత్ర తెలిస్తే నా తప్పేమీ లేకపోయినా నన్ను లోకువగా చూస్తారనీ నాకు తెల్సు. కాని గతం తెలియజెయ్యకుండా దాచిపెట్టి పెళ్లి చేసుకోవడం నాకిష్టంలేదు. అందుకే నన్ను పెళ్ళి చేసుకుంటానంటూ నా అభిప్రాయం అడిగిన నలుగురైదుగుర్ని నవ్వుతూ తిరస్కరించాను. కారణం .... వాళ్ళు ధైర్యవంతులుగా నమ్మకం నాకు కుదరకపోవటమే. ఒక ఉద్యోగిగా కాక మరే యితర భావంతో నన్నెవరు చూస్తున్నట్టుగా తోచినా అటువంటి వాళ్ళకి చాలా దూరంగా తప్పుకుని తిరుగుతున్నాను. ముక్కుకి సూటిగా పోతూ, నిక్కచ్చిగా నిర్భయంగా మాట్లాడటం అలవాటు చేసుకున్నాను. దానితో నాకు గర్విష్ఠి అనీ, అహంకారి అనీ బిరుదులు ప్రసాదించారు. అయినా అవేమీ నేను లెక్కచెయ్యలేదు ! చెప్పానుగా ఈ విషయంలో నేను మొండిదాన్నని. జీవిత పోరాటంలో మొండిగా, ధైర్యంగా,

మంచిగా, పట్టుదలగా ఉన్నవాడే నెగ్గుకురాగలడని నా నమ్మకం .... ఇది నా చరిత్ర. అంతా తెలిశాక కూడా మీ అభిప్రాయం చెక్కుచెదరక నిలిచి వుంటే, మనస్ఫూర్తిగా మీ కిష్టమైతే రేపు ఆదివారం సాయంత్రం ఏడుగంటల లోపు మా ఇంటికి రండి. మీ కిష్టం లేకపోతే, ఆ విషయం ఎలా చెప్పడమా అని మీరు సంకోచపడనక్కర్లేదు. ఇబ్బంది పడనక్కర్లేదు. ఏడుగంటల లోపు మీరు మా యింటికి రాకపోతే మీ కిష్టంలేదని, మీ అభిప్రాయం మారిందని నేను అర్థం చేసుకుంటాను. మళ్ళీ వేరే మీరు చెప్పనక్కర్లేదు. నేనేమైనా అనుకుంటానేమోనని మనసులో మీ కిష్టంలేకపోయినా తప్పనిసరిగా మొహమాటానికి ఒప్పుకోకండి. ఇందులో మొహమాటపడవలసింది లేదు. జీవితానికి సంబంధించిన సమస్య ఇది .... బాగా అలోచించుకుని ఒక నిర్ణయానికి రావలసిందిగా కోరుతున్నాను. నేనేమనుకుంటానో అని బాధ పడకండి. ఆత్మ వంచన ఎవరికీ మంచిదికాదు. దానివల్ల ఇద్దరం నష్టపోతాం తప్ప ఫలితం ఉండదు.

ఇట్లు
సుమిత్ర"

*

ఆతృత అణిచిపెట్టుకోలేక లోపలికి వెళ్ళి టైము చూసింది సుమిత్ర. ఏడు కావడానికింకా పదినిమిషాలు మాత్రమే ఉంది. నిర్లిప్తంగా నవ్వుకుంది.

మళ్ళీ వొచ్చి దొడ్లో మంచంమ్మీద వాలిపోయింది.

మళ్ళీ ఆలోచనల జల్లులో తడిసింది మనసు.

ఎందుకోగానీ .... ప్రకాశంలో మంచి మనిషి కనిపించాడు తన కళ్ళకి. అతని హృదయం అతని కళ్ళల్లో చూడగలిగింది. సహృదయంతో అతను ముందడుగే వేస్తాడు తప్ప వెనుకంజ వేయడని అనిపించింది.

అందుకే ఎంతో ఆలోచించి తన గురించి వివరాలు అతనికి తెలియజేసుకుంది ఉత్తరం ద్వారా. కాని ఇప్పుడు జరగబోయేదేమిటి ? అతను ఒకవేళ ... ఔను .... అందులో వింతేముంది .... అతను కూడా మనిషే. మానసికంగా ఏ బలహీనతలూ లేని మనుషులుంటారా ? అతని ఉద్దేశ్యాలు అతనికుండచ్చు. అతనికి తన గతం నచ్చిఉండదు. తన తప్పేమీ లేని తన పొరపాటేమీలేని తన గతం అతని నిశ్చయాన్ని మార్చేసిందన్న మాట. ఔను. అందుకే ఇంతవరకూ రాలేదు. ఇంక ఏడు కావడానికి ఆట్టే వ్యవధి లేదు. ఇంక రాడనే అనుకోవాలి. కానీ తన అంచనా తప్పినందుకు బాధగా ఉంది. శేఖర్, మోహన్ లాంటి వాళ్ళ లిస్టులోకి ప్రకాశం రాడని తన హృదయం గట్టిగా నమ్మింది. అందుకే ఈ ఊరొచ్చినప్పటినించీ ఎవరి మాటఃకీ లొంగిపోకుండా, ఎవరికీ తన గతం చెప్పకుండా ఉన్న తను ఇన్నాళ్కి ఈ ప్రకాశంకి చెప్పుకుంది. కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటి ? మళ్ళీ పాత కథే. అప్రయత్నంగా నిట్టూర్పు విడిచింది సుమిత్ర.

గాలితో కల్సి సన్నగా వానజల్లు మొదలైంది. లేచి మంచం ఎత్తి ఇంట్లోకి తీసికెళ్ళే ప్రయత్నంలో పడింది.

" అమ్మాయ్ ! సుమిత్రా ! ప్రకాశంగారొచ్చారమ్మా " లోపల్నుంచి తండ్రి వేసిన కేక తొలకరిజల్లులా తోచి సుమిత్ర గుండె ఝల్లుమంది